ఎవరేమన్నారంటే..

విద్యారంగానికి స్వల్ప ఊరట



రంగారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,389 కోట్లు కేటాయించడం హర్షణీయం. గతం కంటే కేటాయింపులు పెరిగినా కాంగ్రెస్ మానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా 15శాతం కేటాయించలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల విద్యాలయాల భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించటం సంతోషకరం. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, పాఠశాలల్లో వసతులకు చర్యలు తీసుకుంటామని ప్రకటించడం ఆహ్వానించతగ్గ పరిణామం. ప్రతీ మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు రూ.500కోట్లు కేటాయింపు శుభపరిణామం.

- ఏవీ.సుధాకర్, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి

వాస్తవానికి దూరంగా బడ్జెట్



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉంది. ఎన్నికల ముందు ప్రజలను ఆకర్షించడానికి ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు ప్రశ్నార్థకంగా మారింది. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతిని ప్రస్తావించకుండా నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసింది. రైతులకు రుణమాఫీ కేటాయించిన బడ్జెట్ సరిపోయేదిగా లేదు. ఆరు గ్యారంటీలకు బడ్జెట్ నిధులు సరిపోవు.

- మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే, వికారాబాద్

మూసీ అభివృద్ధికి నిధుల కేటాయింపు అభినందనీయం



మూసీనది అభివృద్ధికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.వేయికోట్లు కేటాయించడం అభినందనీయం. గత ప్రభుత్వ హయంలో మూసీనది మురికికూపంగా మారింది. అంతేకాకుండా పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థరసాయనాలతో మూసీ పరివాహక ప్రాంతంలోని జలాలు కలుషితమయ్యాయి. ఆక్రమణలు తొలగించి మూసీకి పూర్వవైభవం తీసుకురావడం సంతోషం. మూసీ అభివృద్ధితో పరివాహక ప్రాంత ప్రజలకు ఎంతోమేలు జరుగుతుంది.

- మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ జడ్పీ చైర్మన్

బీసీ సంక్షేమానికి మొండిచెయ్యి



రాష్ట్ర జనాభాలో 55శాతమున్న బీసీ సంక్షేమానికి బడ్జెట్‌లో 8 వేల కోట్లు కేటాయించడం సిగ్గుచేటు. ప్రభుత్వం బీసీలను ఓటర్లుగానే చూస్తుందని, రాష్ట్ర బడ్జెట్‌లో వారికి మొండి చెయ్యి చూపింది. మిగతా సంక్షేమ శాఖలకు బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించి, బీసీ సంక్షేమానికి మాత్రం నామమాత్రంగా నిధులు ఇవ్వడం అన్యాయం.

- ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఎంపీపీ, ఘట్‌కేసర్

నిరాశ పరిచిన బడ్జెట్



పరిగి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసింది. బడ్జెట్‌లో రైతు రుణమాఫీకి నిధులు కేటాయించి ఒకే దఫాలో రెండు లక్షల పంట రుణాలన్నీ మాఫీ చేస్తారని ఆశ పడ్డాం. బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులు చూస్తే రైతుబంధుకు కూడా సరిపోయేలా లేదు. ఎన్నికల ముందు ఒకే దఫాలో రెండు లక్షల రైతు రుణమాఫీ అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారు. ఈ సారి వడ్డీ భారం తప్పేలా లేదు. ప్రభుత్వం రైతులను మోసం చేసింది.

-టి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రైతు, సుల్తాన్‌పూర్, పరిగి

నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రజలను నిరాశ పర్చేలా ఉంది. వ్యవసాయానికి అరకొర నిధులు కేటాయించారు. ఆరు గ్యారంటీల అమల్లో స్పష్టత లేదు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతి ప్రస్తావ లేదు. కౌలు రైతులకు రైతుబంధుకు కేటాయింపులేవు.

- పాలమాకుల జంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి, రంగారెడ్డి

రైతు మోములో.. చిరునవ్వు!

రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్ద పీట

- సాగు చేయని భూములకు రైతు భరోసా కట్
- ఉమ్మడి జిల్లాలో 30శాతం తగ్గనున్న భారం
- కౌలు రైతులకు ప్రయోజనం
- శివార్లన్నీ అర్బన్, పెరి అర్బన్, గ్రామీణ జోన్‌లుగా విభజన
- ఫార్మాసిటీ కాదు.. ఇక ఫార్మా క్లస్టర్లే



రాష్ట్ర ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రకారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలగనుంది. జిల్లాలో పది లక్షల మందికి పైగా రైతులు ప్రభుత్వ పథకాలను అందుకోనున్నారు. దాదాపు రైతులతో సమానంగా ఉన్న కౌలు రైతులకు కూడా ప్రయోజనం కలిగించేలా బడ్జెట్ ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వ్యవసాయానికి పెద్దపీట వేయడంతో జిల్లా వాసులకు ప్రయోజనం కలిగించే పాలమూరు-రంగారెడ్డి, చేవెళ్ల- ప్రాణహిత ప్రాజెక్టులకు కూడా భారీగా నిధులు వస్తాయన్న ఆశతో రైతులున్నారు. కాకుంటే ప్రాజెక్టుల వారీగా నిధులు కేటాయింపు విషయాన్ని ప్రభుత్వం వెల్లడించలేదు.

కౌలు రైతులకూ ప్రయోజనం

ఎకరాకు రూ. 15వేలు రైతు భరోసా ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు కూడా దీన్ని వర్తింపచేయాలని నిర్ణయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది కౌలు రైతులకు ప్రయోజనం కలగనుంది. ఎన్నికల హామీల్లో భాగంగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. రైతుల కోసం కొత్త విత్తన విధానాన్ని అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రైతులు పది లక్షల మందికి పైగా ఉన్నారు. వీరిలో వ్యవసాయం చేసే వారికి మాత్రమే రైతుబంధు అందనుంది.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

కొత్తగా అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ సర్కార్ ఆడంబరాలకు పోకుండా సంక్షేమ బాట పట్టింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ఆరు గ్యారెంటీ స్కీమ్‌లకు నిధులు కేటాయించారు. మహిళలు, రైతులతో పాటు వివిధ అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాల కింద భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ఈ పథకాల కింద మరింత మంది లబ్ధిదారులు ప్రభుత్వ సాయం అందుకోనున్నారు. అదేవిధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల కింద మరింత ప్రయోజనం చేకూరనుంది.

30 శాతం భూములకు రైతు భరోసా కట్!



రైతు భరోసా విషయంలో సర్కార్ తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం వ్యవసాయం చేయని భూములకు రైతు భరోసా కట్‌కానుంది. రైతుబంధు పథకం కింద గత సర్కార్ ఎకరానికి రూ. 12వేలు ఇస్తుండగా కాంగ్రెస్ పార్టీ రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. తాజాగా ప్రకటించిన బడ్జెట్‌లో కూడా రైతు భరోసా విషయాన్ని ప్రస్తావించారు. అయితే అర్హులైన రైతులకే రైతుబంధు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో రైతు భరోసా నిధుల భారం ప్రభుత్వానికి భారీగా తగ్గనుంది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచే ఎక్కువ మందికి రైతు భరోసా కట్ కానుంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో దాదాపు 30శాతానికి పైగా భూములకు రైతు భరోసా నిలిచిపోనుంది. హైదరాబాద్ చుట్టు పక్కల వేలాది ఎకరాల్లో రియల్ ఎస్టేట్ విస్తరించిన సంగతి తెలిసిందే. 20 ఏళ్ల కిందట లే అవుట్లకు కూడా ఇపుడు రైతుబంధు ఇస్తున్నారు. అలాగే జాతీయ రహదారులకు కేటాయించిన భూములకు కూడా తిరిగి రైతు బంధు ఇస్తున్న విషయాన్ని ఇటీవల ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఎప్పుడో అమ్మేసిన భూములకు సంబంధించిన రికార్డులు మారకపోవడంతో ధరణిలో పాత రైతుల పేర్లే వస్తున్నాయి. కానీ ఇందులో లే అవుట్లు వచ్చి ఇళ్లు కూడా నిర్మించారు. ఇలాంటి వారందరికీ రైతుబంధు వస్తుంది.. కాంగ్రెస్ సర్కార్ ఇలాంటి వారికి పెట్టుబడి సహాయం పూర్తిగా నిలిపి వేయాలని నిర్ణయించింది.



పేద విద్యార్థులకు ఊరట

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పథకాల్లో నిధులు పెంచారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలకు భారీగా నిధులు కేటాయించారు. ప్రతీ మండలానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఆ మేర చర్యలు తీసుకుంది. పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు రూ. 500 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో ప్రతి మండలంలో అన్ని సౌకర్యాలతో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కానుంది. అదేవిధంగా మూసీ నది ప్రక్షాళన కోసం రూ.1000 కోట్లు నిధులు విడుదల చేయడంతో మూసీ పరివాహక ప్రాంతంలో సుందరీకరణ పనులు జోరుగా సాగుతాయి. అలాగే రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్శిటీతో పాటు ఇతర యూనివర్శిటీలకు భారీగా నిధులు కేటాయించారు. నిరుద్యోగులు ఎదురుచూస్తున్న డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుళ్ల రాత పరీక్షలు కూడా సకాలంలో నిర్వహిస్తామని తెలిపారు.



ప్రాజెక్టుల వారీగా నిధుల కేటాయింపుపై స్పష్టత కరువు

నీటిపారుదల ప్రాజెక్టులకు రూ. 28వేల కోట్లు కేటాయించినప్పటికీ ఓట్ ఆన్ అకౌంట్ వల్ల ఏఏ ప్రాజెక్టులకు ఎన్నెన్ని నిధులు అనే దానిపై స్పష్టత రాలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులు ఎంతో కాలంగా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కోసం ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. అయితే మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేవెళ్ల- ప్రాణహిత ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళతామని ఇంతకు ముందు ప్రకటించింది. దీంతో ఈ రెండు ప్రాజెక్టులపై ఉమ్మడి జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఫార్మాసిటీ కాదు.. ఫార్మా క్లస్టర్లే

తాజా బడ్జెట్‌లో ఫార్మాసిటీ ఊసే లేదు. అయితే ఫార్మాసిటీకి బదులు ఫార్మ క్లస్టర్ల ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో నగర శివార్లలో కొన్ని ఫార్మా క్లస్టర్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. అలాగే నగర శివారు ప్రాంతాలను మూడు జోన్‌లుగా విభజించి అభివృద్ధి చేయనున్నారు. ఇందులో రింగురోడ్డు లోపలి భాగాన్ని అర్బన్ జోన్‌గా, రింగ ్రరోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య భాగాన్ని పెరి అర్బన్‌గా, రీజినల్ రింగురోడ్డు బయట రూరల్ జోన్‌గా విభజించనున్నారు. దీంతో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల పరిధిలోని పలు గ్రామాలు పెరిఅర్బన్ పరిధిలోకి రానున్నాయి. ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేస్తామన్నారు. ధరణి ఏర్పాటు చేయడం వల్ల తమ భూములు తమ పేరుమీద లేకుండా పోయాయని, ఇందులో అనేక అవకతవకలు జరిగాయని ఉమ్మడి జిల్లాలోని అనేకమంది రైతులు ఆందోళనలకు కూడా దిగారు. ఇప్పుడు ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిని ప్రక్షాళన చేస్తే ఉమ్మడి జిల్లాలోని దీర్ఘకాలిక భూ సమస్యలకు కొత్త పరిష్కార మార్గాలు దొరికే అవకాశం ఉంది.

14 నుంచి శెట్టిపల్లిలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కొలువుదీరిన దేవతామూర్తులు

ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

ఆమనగల్లు ఫిబ్రవరి10: మండలంలోని శెట్టిపల్లిలో గల ప్రసిద్ధ అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఆమనగల్లు, సమీప మండలాల భక్తులు బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు.శనివారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, ట్రస్టీ కోట్ల జగన్మోహన్, అర్చకులు నవీన్‌శర్మ, గూడ కృష్ణమాచార్యు పరిశీలించారు. 14న గణపతిపూజ, పుణ్యాహఃవచనం, మంత్ర పుష్పం, 15న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, సామూహిక కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమం, 16న రథోత్సవం, 17న చక్రతీర్థం, 18న ముగింపు వేడుక కార్యక్రమాలుంటాయని వివరించారు.

సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి

- సీవీఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, కో-ఆర్డినేటర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విజయమేర్
- కళాశాలలో ఉత్సాహంగా రాష్ట్రస్థాయి హ్యాకథాన్

ఆదిభట్ల, ఫిబ్రవరి 10 : ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త విషయాలు తెలుసుకుంటూ సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఎల్‌సీ శివారెడ్డి, కో-ఆర్డినేటర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్(తెలంగాణ) ఆఫీసర్ విజయమేర్‌లు విద్యార్థులకు సూచించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాకథాన్ ఉత్సాహంగా కొనసాగింది. వైస్ ప్రిన్సిపాల్ ఎల్‌సీ శివారెడ్డి, విజయమేర్, సీతారాం నగేష్‌లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలపై పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. మార్పులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ముందుకు సాగితే జీవితంలో అనుకున్నది సాధిస్తారని తెలిపారు. నూతన ఆవిష్కరణలకు జీవం పోస్తూ లక్ష్యం వైపుగా అడుగులు వేయాలన్నారు. గూగుల్ డెవలపర్స్ స్టూడెంట్ క్లబ్స్, సీవీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో బిట్‌అండ్‌బిల్ట్ రాష్ట్రస్థాయి హ్యాకథాన్‌లో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సాంకేతిక నైపుణ్యాలను వినియోగించుకుని తమ ప్రతిభను చాటారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలతో పాటు బహుమతులు అందజేశారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆగిన 'క్రీడా ప్రాంగణాల' బిల్లులు

- ఏడాదిగా పెండింగ్‌లోనే..
- తీవ్ర నిరాశలో కాంట్రాక్టర్లు
- పూర్తిస్థాయిలో విడుదల కాని బిల్లులు
- మండలంలో రూ.5లక్షల వరకు పెండింగ్



సంగెంలోని క్రీడా ప్రాంగణం

కేశంపేట, ఫిబ్రవరి 10 : గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు వ్యాయామంతోపాటు క్రీడల్లో ప్రతిభ చాటేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా క్రీడాప్రాంగణాలు నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేసింది. అయితే, దాదాపు ఏడాది క్రితం పనులు పూర్తిచేసినా నేటికీ బిల్లులు రాక కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని నిర్ణయించింది. ఆ బాధ్యతను సర్పంచ్‌లకు అప్పగించింది. ఈ మేరకు కేశంపేట మండలంలో 29 గ్రామ పంచాయతీలకు గాను 18 జీపీలు.. అల్వాల, చింతకుంటపల్లి, పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, కొనాయపల్లి, సంగెం, సంతాపూర్, నిర్దవెల్లి, దత్తాయపల్లి, తూర్పుగడ్డ తండా, వేముల్‌నర్వ, మంగళగూడ, పుట్టోనిగూడ, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట, లేమామిడి, కేశంపేట, తొమ్మిదిరేకులలో క్రీడా ప్రాంగణాలు నిర్మించేందుకు ముందుకు వచ్చాయి. అయితే, పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో చాలా గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కాంట్రాక్ట్ తీసుకొని క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. గతేడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో క్రీడా ప్రాంగణాల నిర్మాణాలను పూర్తి చేశారు.

వాటిని మట్టితో చదును చేసి వెల్‌కం బోర్డు, వాలీబాల్, ఖోఖో పోల్స్, వ్యాయామం చేయడానికి వివిధ రకాల పరికరాలు ఏర్పాటు చేశారు. కాగా, ఒక్కో క్రీడా ప్రాంగణానికి దాదాపు రూ.లక్షా 20వేల వరకు ఖర్చు చేశారు. పనులు పూర్తిచేసి ఏడాది పూర్తి కావస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, మండలంలో 18 క్రీడా ప్రాంగణాలకు సంబంధించి దాదాపు రూ.5లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మార్చిలో కాంట్రాక్టర్ల ఖాతాల్లో డబ్బులు జమచేయనున్నట్లు ఉపాధిహామీ టీఏ తెలిపారు.

ఏడాదిగా ఎదురుచూస్తున్నాం



క్రీడా ప్రాంగణం నిర్మించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వార్డుమెంబర్‌గా బాధ్యత తీసుకొని పనులు చేయించా. దాదాపు రూ.లక్షా 20వేలు ఖర్చు చేశాను. ఇంకా రూ.నలభై వేలు రావాల్సి ఉంది. ఏడాదిగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నాం. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి.

- కుమ్మరి శ్రీనివాస్, సంగెం, కేశంపేట మండలం

అప్పు తెచ్చి పనులు చేశా



తొమ్మిదిరేకులలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు అప్పు చేసి పనులు పూర్తిచేశా. ఆ డబ్బులకు ఏడాదిగా వడ్డీ కడుతున్నా. అధికారులు సకాలంలో పనులను ఆన్‌లైన్ చేయకపోవడంతో బిల్లులు విడుదల కాలేదు. దాదాపు రూ.30వేలు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలి.

- బాల్‌రాజ్, తొమ్మిదిరేకుల

ఫోర్జరీ, చీటింగ్ కేసుల్లో నిందితుడి అరెస్టు

శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న నారాయణరెడ్డి

షాద్‌నగర్, ఫిబ్రవరి 10 : ఫోర్జరీ, చీటింగ్‌లకు పాల్పడి సుమారు రూ.2కోట్లు విలువ చేసే ప్లాట్లను విక్రయించి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేశామని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వెల్లడించారు. శనివారం షాద్‌నగర్‌లోని ఏసీపీ కార్యాలయంలో ఏడీసీపీ కె.రాంకుమార్, ఏసీపీ రంగస్వామి, టౌన్ సీఐ ప్రతాప్‌లింగంలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన కె.రోజా రాణి కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో సర్వే నంబర్ 69, 70, 69/ఏ, 70/ఏ 70/ఏఏ, 69/ఈ, 70/ఈ, 81, 82లలో భూమి కొని మేరీ సువర్ణ భూమి హౌసింగ్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట వెంచర్ ఏర్పాటు చేశారు. దీనికి రోజారాణి చైర్‌పర్సన్‌గా, ఆమె కూతురు కె.కావ్య మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఎం.సాయిసుధాకర్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ప్లాట్ల అమ్మకంలో సాయిసుధాకర్ ఫోర్జరీ, చీటింగ్‌లతో కంపెనీ నిధులను దుర్వినియోగం చేయడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. అనంతరం సాయిసుధాకర్.. కల్యాణ్ చక్రవర్తి అనే వ్యక్తితో కలిసి ఫోర్జరీ సంతకాలతో 157, 176, 189 నంబర్ల ప్లాట్లలో గల రూ.2కోట్లు విలువ చేసే 1,164 గజాల స్థలాన్ని హైదరాబాద్‌కు చెందిన కృష్ణమోహన్, పల్లయ్యగుప్తాలకు అమ్మారు. ఈ మోసాన్ని తెలుసుకున్న రోజారాణి నిందితులపై 2018లో కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు 2021 డిసెంబర్ 21న సాయిసుధాకర్‌ను అరెస్టు చేశారు. ఎ2 కల్యాణ్ చక్రవర్తి మూడేళ్లుగా పరారీలో ఉన్నాడు. ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో సీఐ ప్రతాప్‌లింగం ఆధ్వర్యంలో స్పెషల్ టీంను ఏర్పాటు చేసి కల్యాణ్ చక్రవర్తి కోసం గాలించగా అతడు ఈ నెల 9న విజయవాడలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. తప్పించుకు తిరుగుతున్న కృష్ణమోహన్, పల్లయ్యగుప్తాలను సైతం త్వరలోనే అరెస్టు చేస్తామని డీసీపీ వెల్లడించారు. ప్లాట్ల కొనుగోలుదారులు డాక్యుమెంట్లు అన్నీ చెక్ చేసుకున్న తర్వాతే కొనుక్కోవాలని అధికారులు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్సై శరత్‌కుమార్, ఏఎస్ఐ నరసింహ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

చేవెళ్ల, ఫిబ్రవరి 10: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ సమీక్ష సమావేశం చేవెళ్లలోని అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సునీతారావు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మహిళా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మహిళలకు మరిన్ని పథకాలను అమలు చేస్తామన్నారు. సోనియాగాంధీ లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి పోటీ చేయబోతున్నారని తెలిపారు. ఏ ఎన్నిక వచ్చినా వాటిలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రజాసేవచేస్తూ రాజకీయంగా ఎదగాలన్నారు. సమావేశంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల మహిళా విభాగం అధ్యక్షులు శోభారాణి, జయమ్మ, నాయకురాళ్లు సదాలక్ష్మి, పామెన జ్యోతి, బండారు శైలజాఆగిరెడ్డి, దేవర సమాతరెడ్డి, నాగమణి, అమృత, రమ్యశ్రీరెడ్డి, ప్రత్యూషరెడ్డి, అశ్విని, సుశీల, గోనె సరితారెడ్డి, కళావతి, మంజుల, పుష్పమ్మ, దివ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశం విద్యార్థులకు ప్రేరణ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు.

చదువుతో పాటు యువత
క్రీడారంగంలోనూ రాణించాలి


చేవెళ్లలో క్రికెట్ ఆడుతూ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 10: యువత చదువుతో పాటు క్రీడా రంగం లోనూ రాణించాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కొండా వెంకట్‌రంగారెడ్డి, జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, పలువురు నాయకులతో కలిసి విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ టోర్నమెంట్ దోహదం చేస్తుందని అన్నారు. 2నెలల పాటు మెగా ఈ క్రికెట్ టోర్నీ కొనసాగుతుందన్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధి 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 100జట్లు ఈ టోర్నీలో పాల్గొటాయన్నారు. ఈ పోటీల్లో విజేతకు షీల్డ్, రూ.3లక్షల నగదు బహుమతి, రన్నరప్స్‌కు రూ.2లక్షల బహుమతి ఇస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. నేటి గెలుపును భవిష్యత్తుకు బంగారు బాటలుగా మలుచుకోవాలని, అలాగే ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుంటూ గెలుపునకు ప్రయత్నం సాగించాలని విశ్వేశ్వర్‌రెడ్డి యువకులకు సూచించారు. ఆ రోజుల్లోనే వెంకట్‌రంగారెడ్డి, మాధవరెడ్డి వారి టీజీ లైఫ్‌లోనూ క్రికెట్, హాకీ తదితర ఆటలు ఆడటంతో పాటు ఇతరులతో ఆడించేవారని గుర్తుచేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ.. క్రీడారులను వెలికితీసేందుకు ఏర్పాటు ఈ టోర్నీని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, యువత మధ్య స్నేహభావం పెరుగుతాయన్నారు. లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో టోర్నీ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాందేవ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, వివిధ స్థాయిల నాయకులు కావ్యకృష్ణగౌడ్, కుంచం శ్రీనివాస్ గుప్తా, దేవుని శర్వలింగం, వెంకట్‌రెడ్డి, పి.సత్యనారాయణ, కృష్ణారెడ్డి, అశోక్, శ్రీనివాస్, నాగారాజు, ఆయా మండలాల క్రీడాకారులు, యువకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తిచెంది ఆటో డ్రైవర్ ఆత్మహత్య


ఆమెర్ ఖాన్(ఫైల్)

ధారూరు, ఫిబ్రవరి 10 : జీవితంపై విరక్తితో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా స్టేషన్ ధారూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. స్టేషన్ ధారూరుకు చెందిన ఎండీ.హమీద్‌ఖాన్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ఆమెర్‌ఖాన్(21) సైతం తండ్రి చేస్తున్న వృత్తిలోనే కొనసాగుతున్నాడు. కాగా ఆమెర్ కొంత కాలంగా మానసికంగా కుంగిపోయి ఉంటున్నాడు. ఈ నెల 9న స్టేషన్ ధారూరులోని తన పాత ఇంటి వద్ద పురుగుల మందు తాగి పడిపోయాడు. సమాచారం అందుకున్న తండ్రి అక్కడికి చేరుకుని ఆమెర్‌ను వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు రెఫర్ చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆమెర్ కోలుకోలేక శుక్రవారం రాత్రి చనిపోయాడు. తన జీవితం ఇంతే అంటూ ఆమెర్ మనోవేదనకు గురయ్యేవాడని అతడి తండ్రి హమీద్ పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఎడ్ కోర్సులో అడ్మిషన్లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వికారాబాద్, ఫిబ్రవరి 10: రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో రెండేళ్ల డీఎడ్ కోర్సులో చేరేందుకు డీఈఈ. సెట్ ఉత్తీర్ణులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఈ నెల 14న మరోసారి నిర్వహిస్తామని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి శనివారం తెలిపారు. వికారాబాద్‌లో గల డైట్ కాలేజీలో పరిశీలన ప్రక్రియ ఉంటుందని, 15 నుంచి 17వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. 22న సీట్లు కేటాయిస్తారన్నారు. ఎంపికైన వారు ఈ నెల 26వ తేదీలోగా సీటు అలాటైన కాలేజీలో ఫీజు చెల్లించి అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు.

మిషన్ భగీరథ సామగ్రి
కంపెనీల పాలు!

- భారీగా తరలిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు


పరిగిలో మిషన్ భగీరథ సామగ్రితో పట్టుబడిన డీసీఎం

పరిగి, ఫిబ్రవరి 10 : విలువైన సామగ్రిని స్ర్కాప్‌కింద విక్రయిస్తున్నారు. మిషన్ భగీరథకు చెందిన సామగ్రిని డీసీఎం(ఏపీ23 డబ్ల్యూ8731)లో తరలిస్తుండగా శనివారం పరిగిలో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వాహనం స్ర్కాప్‌ను వికారాబాద్ వైపు నుంచి పరిగిలోని స్టీల్ కంపెనీలకు తరలిస్తుండగా పట్టుకున్నారు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు, మిషన్ భగీరథ అధికారులు సమాచారం ఇచ్చారు. వాహనంలో మిషన్ భగీరథ సామగ్రి ఉందని ప్రాథమికంగా గుర్తించారు. ఈ వస్తువులను ఎక్కడ నుంచి తెస్తున్నారని పోలీసులు అడగ్గా మర్పల్లి నుంచి అని డీసీఎం డ్రైవర్ చెప్పాడు. పట్టుకున్న డీసీఎంను అధికారులు వదిలేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా నిత్యం వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఇనుము, పైప్‌లు తదితర సామగ్రిని అక్రమంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పరిగి, వికారాబాద్ ప్రాంతాల నుంచి నిత్యం ఇలా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇనుప సామగ్రిని పరిగిలో గల సుగుణ, శిఖర, అభిరామ్ కంపెనీలకు తరలిస్తున్నారని చెబుతున్నారు. కంపెనీ యజమానులు తక్కువ ధరకు సామగ్రిని దొడ్డిదారిన కొంటున్నారు. స్ర్కాప్ అమ్మకాలు ఏళ్లుగా కొనసాగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


డీసీఎంలో తరలిస్తున్న పైప్‌లైన్ సామగ్రి

బుక్ కీపర్ సస్పెన్షన్

దోమ, ఫిబ్రవరి 10: అవకతవలకు పాల్పడిన మోత్కూర్ మహిళా సంఘం బుక్‌కీపర్ మల్లేశంను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.కొన్ని సంవత్సరాల క్రితం మహిళా సంఘం నిధులను దుర్వినియోగం చేసిన బుక్ కీపర్‌పై ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన డీఆర్‌డీఏ అధికారులు ఈ నెల 3న అతడిని సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా ఏపీఎం సురేశ్ ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచుతూ మల్లేశంను విధుల్లో కొనసాగించడంతో ఏపీఎం తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టు తప్పితే పడిపోవడమే!

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 10: రోడ్డుపై వాహనాల్లో ప్రయాణించే సమయాల్లో ఎంత జాగ్రత్తగా వెళ్తున్నా కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాంటిది నిర్లక్ష్యంగా ఆటోలో వెనక డోరు సరిగా వేయకుండానే రయ్యిమంటూ దూసుకెళ్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న దృశ్యం ఇక్కడ కన్పిస్తోంది. శనివారం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై అజీజ్‌నగర్ వద్ద ఓ ఆటోలో ప్రయాణికులు ఆటో వెనుక డోరు తీసి కూర్చొని ప్రయాణించాడు. నిత్యం చలానాలు విధించే రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు ఇలాంటివి కనిపించడం లేదా? అని తోటి ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.



బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి10: ప్రజా పాలనలో ప్రజల సంక్షేమానికే రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణుల సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారన్నారు. కాంగ్రెస్ పాలనలోకి వచ్చిందే ఆరు గ్యారంటీల హామీతో అని, వాటి అమలుకు బడ్జెట్‌లో రూ.53.196కోట్లు కేటాయించడం చూస్తే కాంగ్రెస్ చిత్తశుద్ధి స్పష్టం అవుతోందన్నారు. వ్యవసాయ రంగానికి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, విద్యా రంగాలకు నిధులు భారీగా కేటాయించడం సంతోషకరం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను బురిడీకొట్టించి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని సంజీవరెడ్డి మండిపడ్డారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లతో పాటు, రాష్ట్రంలోని అత్యధిక ఎంపీ సీట్లను కైవసం చేసుకుంటామని దీమా వ్యక్తం చేశారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో 15 నుంచి బ్రహ్మోత్సవాలు



తలకొండపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని చుక్కాపూర్‌లో గల ప్రసిద్ధ శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు కొనసాగే ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. చుట్టు పక్కల మండలాల భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొంటారు. 15న గణపతిపూజ, దీపారాధన, 16న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుల కల్యాణోత్సవం, అన్నదానం, 17న అర్చన, బండలాగుడు పోటీలు, 18న రథోత్సవం, 19న సత్యనారాయణస్వామి వ్రతాలు, చక్రతీర్థం కార్యక్రమాలుంటాయని అర్చకులు వెంకటేశ్వరశర్మ వివరించారు.

అన్మాస్‌పల్లిలో ఘనంగా హనుమత్ హోమం


పూజల్లో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

కడ్తాల్ , ఫిబ్రవరి 10: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి శ్రీర వీరాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం హనుమత్ హోమం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలు , ప్రత్యేక పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ పోతుగంటి శంకర్ ప్రియాంక దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షుడు కోర్పోలు లక్ష్మారెడ్డి, ఫిరమిడ్ స్పిర్చ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆఫ్ ఇండియా విజయభాష్కర్ రెడ్డి, జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి, భక్తుల హనుమ నామస్మరణతో వీరాంజనేయ స్వామి దేవాలయం మార్మోగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకుడు శంకర్ ఆధ్వర్యంలో బక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు బీచ్యానాయక్, రాములు, నరేందర్, వేణుగోపాల్, గూడూరు భాస్కర్ రెడ్డి, చేగూరి వెంకటేశ్, లక్ష్మయ్య జగన్‌గౌడ్, నర్సింహ్మా గౌడ్, జగన్, వెంకటేశ్, కేశవులు, పర్వతాలు, రామకృష్ణ , భరత్, తదితరులు పాల్గొన్నారు.

మూడోసారీ ప్రధాని నరేంద్రమోదీనే..


మాట్లాడుతున్న మాధవరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 10 : దేశంలో మూడోసారీ నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయం అని, దేశ భక్తి, సిద్ధాంతాలు కలిగిన పార్టీ బీజేపీ అని ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో సమావేశంనిర్వహించి జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా అంతారం లలిత(తాండూరు), టి.రాజేందర్‌రెడ్డి, రాములు, ఎస్.శ్రీధర్‌రెడ్డి(వికారాబాద్), ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి(వికారాబాద్), కృష్ణ(తాండూరు), రాంచందర్(పరిగి), కార్యదర్శులు విజయ్‌రాజ్, జగన్, మల్లేశ్, రాకేష్, భద్రేశ్వర్, శ్రీకాంత్, పెంటయ్యగుప్తా, ట్రెజరర్ పి.సతీష్, ఆఫీస్ సెక్రటరీ యాదగిరి, అధికార ప్రతినిధి వెంకట్, బీజేవైఎం అధ్యక్షుడిగా చరణ్‌రెడ్డి, లేడీ వింగ్‌కు శిరీష, కిసాన్ మోర్చా సంజీవరెడ్డి, ఎస్సీ మోర్చాకు గాలయ్య, బీసీ మోర్చా శ్రీహరి, ఎస్టీ మోర్చా గోవింద్, మైనార్టీ మోర్చాకు జాకీర్ జహీర్ అబ్బాస్‌లను నియమించారు.

బడ్జెట్ అంకెల గారడీలా ఉంది : నర్సింహారెడ్డి



రంగారెడ్డి అర్బన్: రాష్ట్ర బడ్జెట్ రాజకీయ ప్రసంగంలా ఉందని, అన్ని వర్గాల ప్రజలను నిరాశపర్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇదో అంకెల గారడీ బడ్జెట్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు చాలీచాలని నిధులు కేటాయించారన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ప్రస్తావనే లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించలేదని, నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదని విమర్శించారు.

తెలంగాణ ప్రయోజనాలు ఢిల్లీకి తాకట్టు


ఇబ్రహీంపట్నంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10: తెలంగాణ ప్రజాప్రయోజనాలను కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ పాలకులకు తాకట్టు పెడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ ముఖ్య నేతలు, మండల నాయ కులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దక్షిణ తెలంగాణ రాష్ట్రాన్ని ఎడారిగా మార్చేలా కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర తప్పిదమన్నారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల అప్పగింతకు ఒ ప్పుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందన్నారు. కృష్ణ, గోదావరి నదుల జలాలు తెలంగాణలోని ప్రతి ఎకరానికీ చేరేలా కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను పూర్తిచేసిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి కాలువలు తవ్వడమే మిగిలిందని, అవి పూర్తయితే 12లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇప్పుడు ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తే ప్రయోజనముండదని ఆవేదన వ్యక్తంచేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చివరి ఆయకట్టు అని, రాచకొండ లిఫ్ట్‌తో అవసరమైన సాగునీ రొస్తుందన్నారు. కాంగ్రెస్ పాలకుల నిర్ణయానికి నిరసనగా ఈ నెల 13న బీఆర్ఎస్ చేపట్టే చలో నల్లగొండ పోరుసభకు రైతులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకుడు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు రాములు, రమేష్, కిషన్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు జంగయ్య, దా మోదర్, వేణుగోపాల్‌రావు, బాషా పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జైపాల్ యాదవ్

నల్లగొండ సభను జయప్రదం చేయాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 10 : కృష్ణాజలాల్లో వాటా హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. కృష్ణా బోర్డు బాధ్యతలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పగించడం సరైంది కాదన్నారు. నల్లగొండ జిల్లా సభ విజయవంతంపై శనివారం బీఆర్ఎస్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. చలో నల్గొండ సభ పేరిట రూపొందించి పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనే సభ విజయవంతాన్ని పార్టీ శ్రేణులు అంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ఆయన సూచించారు. నాయకులు, కార్యకర్తలకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జడ్పీటీసీలు దశరథ్ నాయక్, అనురాధ పత్యానాయక్, ద్యాప విజితారెడ్డి, డీసీసీడీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, నాయకులు లాలయ్యగౌడ్, భాస్కర్‌రావు, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, దశరథ్‌నాయక్ తదితరులున్నారు.

ఎరువుల విక్రయానికి ఆధార్ అనుసంధానం తప్పనిసరి

● జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి


చౌదరిగూడలో రికార్డులు పరిశీలిస్తున్న గీతారెడ్డి

చౌదరిగూడ, ఫిబ్రవరి 10: ఆధార్ కార్డు అనుసంధానంతోనే ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని లాల్‌పహడ్‌లోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఎరువులు, మందులు తీసుకున్న రైతులకు బి ల్లులను వెంటనే ఇవ్వాలని, అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. మండల వ్యవసాయాధికారి కృష్ణమోహన్ ఉన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఆమనగల్లు, ఫిబ్రవరి 10: ఆమనగల్లు పట్టణంలోని మహతి ఆసుపత్రి వద్ద నేడు(ఆదివారం) ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శిబిరం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. డాక్టర్ శేషం శిబిరంలో వైద్య పరీక్షల నిర్వహిస్తారని వివరించారు. ఆమనగల్లు పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



కూరగాయల వ్యాపారులకు కరపత్రాలు అందజేస్తున్న రాంచందర్, తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 10 : ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా కిసాన్ సభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ కోరారు. శనివారం సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్‌తో కలిసి మండల కేంద్రంలోని కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారులకు భారత్ బంద్‌కు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ, నిరుపేదలకు తీరని అన్యాయం చేయడానికి ప్రధాని మోదీ కుట్రపూరితమైన పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా చేపట్టనున్న బంద్‌లో కార్మికులు, కర్షకులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు ఎ.కుమార్, ఆర్.శేఖర్, గాదె సత్తయ్య తదితరులున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కొందుర్గు, ఫిబ్రవరి 10: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని చిన్న ఎల్కిచర్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.శేఖర్ క్రీడాకారులకు సూచించారు. మండల పరిధిలోని శ్రీరంగాపూర్ చౌరస్తా వద్ద శనివారం చిన్న ఎల్కిచర్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2ను ఆయన ప్రారంభించారు. టోర్నమెంట్‌లో చిన్నఎల్కిచర్ల, శ్రీరంగాపూర్, పర్వతాపూర్ గ్రామాల జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. విజేత జట్టుకు రూ.20వేల నగదు, రన్నరప్ జట్టుకు రూ.10వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా హనుమాన్ పల్లకీ సేవ



షాద్‌నగర్, ఫిబ్రవరి 10 : మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామనామస్మరణ, హనుమాన్ చాలీసా పఠనం చేశారు. కౌన్సిలర్ ఈశ్వర్ రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు.

తాజా మాజీ సర్పంచ్‌కు సన్మానం

మాడ్గుల, ఫిబ్రవరి 10 : మండలంలోని కొల్కులపల్లి తాజా మాజీ సర్పంచ్ భట్టు అనురాధకు గ్రామస్తులు గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, ఎంపీటీసీ భట్టు కిషన్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి సర్పంచ్‌ను శాలువాతో సన్మానించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు మొగుతాల బాలకృష్ణ, నాగిళ్ళ



సమసమాజ స్థాపనకే 'న్యాయ్ యాత్ర'

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు, ఫిబ్రవరి 10: దేశంలో సమసమాజ స్థాపన కోసమే రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర నిర్వహిస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రం శివారు గ్రామమైన లూర్దునగర్‌లో ఏసుక్రీస్తు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ మొదటి విడతలో భాగంగా భారత్ జోడో యాత్రను కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నిర్వహించారని, రెండో విడతలో మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు న్యాయ్ యాత్రను నిర్వహిస్తున్నారని తెలిపారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు పది రోజులుగా మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి సంఘీభావ యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ఎంపీ ఏనాడు సమస్యలను పట్టించుకోలేదని, గ్రామాలు, మండలాలల్లో ఎంపీ పర్యటించలేదని, దాంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం వంశీచంద్‌రెడ్డి అన్ని గ్రామాల్లో తన యాత్ర కొనసాగిస్తున్నారని, ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారని అన్నారు. షాద్‌నగర్ నియోజవర్గంలో నేటి నుంచి కొత్తూరు మండల పరిధిలోని సిద్ధాపూర్‌లో ఉదయం 8గంటలకు సంఘీభావ యాత్ర ప్రారంభమవుతుందని, అక్కడి నుంచి ఎస్‌బీపల్లి, కొడిచర్ల, పెంజర్ల మీదుగా మండల కేంద్రం కొత్తూరుకు చేరుకొన్నాక కార్నర్ మీటింట్ ఉంటుందని చెప్పారు. అనంతరం నందిగామ మండల పరిధిలోని చేగూరు, వెంకమ్మగూడ, వీర్లపల్లి, అప్పారెడ్డిగూడ, సాయంత్రం 7 గంటలకు నందిగామలో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. 12న సోమవారం కొందుర్గు మండల పరిధిలోని పాత ఆగిర్యాల నుంచి పాదయాత్ర ప్రారంభం కానుందని, అక్కడి నుంచి కొత్త ఆగిర్యాల, వెంకిర్యాల, తంగెళ్లపల్లి, మధ్యాహ్నం మండల కేంద్రం కొందుర్గులో కార్నర్ మీటింగ్ ఉంటుందన్నారు. అనంతరం జిల్లేడ్-చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిర, రావిర్యాల, గుర్రంపల్లి, ఇంద్రానగర్ గ్రామలతో పాటు మండల కేంద్రం చౌదరిగూడలో సాయంత్రం కార్నర్ మీటింగ్ ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు. 13న మంగళవారం కేశంపేట మండలం నిర్దవెల్లి నుంచి యాత్ర ప్రారంభం కానుందని, అక్కడి నుంచి లేమామిడి, కాకునూర్, సుందరాపూర్ నుంచి మండల కేంద్రం కేశంపేట్‌లో కార్నర్ మీటింగ్ ఉంటుందని, అనంతరం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరం నుంచి పాదయాత్ర ప్రారంభం కానుందని, అక్కడి నుంచి కిషన్ నగర్, హాజిపల్లి మీదుగా షాద్‌నగర్ చేరుకొని చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కాగా, అంతకుముందు ఎమ్మెల్యే మండల కేంద్రంలో ఓ బైక్ షోరూంను ప్రారంభించారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, కె.రాములుగౌడ్, బి.నరేందర్, బి.రవి, సి.కృష్ణయ్య, రామస్వామి, బి.నర్సింలు, జీబీ కృష్ణ, ప్రతాప్‌రెడ్డి, జార్జిరెడ్డి, మల్రెడ్డి, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, వేణుగోపాల్‌లు పాల్గొన్నారు.

కార్పొరేట్ దోపిడీని అరికడదాం

● రౌంట్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు


సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 10 : దేశంలో కార్పొరేట్ దోపిడీని అరికట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘు, కార్మిక సంక్షేమ సంఘం కన్వీనర్ పినపాక ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. దేశంలో కార్పొరేట్ దోపిడీని అంతంచేసి రిపబ్లిక్ ఆఫ్ ఇండియా సెక్యులర్ డెమోక్రటిక్ వ్యవస్థను తీసుకురావల్సిన అవసరం ఉందని తెలిపారు.

'రాష్ట్రాభివృద్ధికి దోహదపడే బడ్జెట్'

ఆమనగల్లు, ఫిబ్రవరి 10: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రజా రంజకంగా, రాష్ట్రాభివృద్ధికి దోహద పడేలా ఉందని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రజా పాలనలో బాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కు రూ.53,196 కోట్లు కేటాయించి తమ చిత్తశుద్దిని నిరూపించుకుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రూ.2,75,891 కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు తగిన ప్రాధాన్యం కల్పించినట్లు పేర్కొనారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారని వివరించారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి ప్రజలకు పంచడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు.

ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు 2024-25 బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించడం పట్ల కేఎన్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్‌బాబా హర్షం వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ముస్లిం మైనార్టీలను పట్టించుకోలేదని, 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. బడ్జెట్‌లో రూ.2265 కోట్లు కేటాయించడం కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

దివ్యాంగులపై చిన్నచూపు

ఇబ్రహీంపట్నం : బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడం వారిని చిన్నచూపు చూడటమేనని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి, కార్యదర్శి జెర్కోని రాజులు పేర్కొన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందని ప్రశ్నించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్, ఫిబ్రవరి 10 : విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలని కడ్తాల సీఐ శివప్రసాద్ అన్నారు. కడ్తాల మండలం రావిచెడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, నైతిక విలువలు, క్రమశిక్షణ, కుటుంబ బాధ్యతలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి


భూమిపూజ అనంతరం చెక్కు ఇస్తున్న యాదిరెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 10 : ఛత్రపతి శివాజీని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గొల్లగూడెం యాదిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో శివాజీ విగ్రహానికి భూమిపూజ చేసి రూ.5లక్షల చెక్కును గ్రామస్థులకు అందజేశారు.అదే విధంగా గ్రామానికి చెందిన గొల్లగూడెం విక్రమ్‌రెడ్డి రూ.లక్షా 50వేల చెక్కును విరాళంగా అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన వీరుడు, ధీరుడు శివాజీ అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చరిత్రను చదివి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. న్యాయవాదులు మాణిక్యం, ప్రభాకర్, గ్రామస్థులు దయాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం తహసీల్దార్ బదిలీ

యాచారం, ఫిబ్రవరి 10 : మండల తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డిని బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవీన్‌మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, శ్రీకాంత్‌రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రశంసలందుకున్నారు. ప్రభుత్వం ఆయన స్థానంలో ఎవరినీ నియమించ లేదు. రెండు రోజుల్లో కొత్త తహసీల్దార్ బాధ్యతలు చేపడతారని సమాచారం. కాగా సరూర్‌నగర్, షాబాద్, మల్కాజ్‌గిరి, జిల్లెడ్ చౌదర్‌గూడ, మల్కాజ్‌గిరి ఆర్డీవో కార్యాలయ డీఏవోలను కూడా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

● ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్



షాబాద్, ఫిబ్రవరి 10 : బంజారాల ఆరాధ్య దైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ప్రతీ జిల్లా క్లస్టర్‌కి రూ.కోటి నిధులు కేటాయించి, జిల్లా, మండల తండాల వ్యాప్తంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. అన్ని శాఖల్లో గిరిజన రిజర్వేషన్లు 10శాతం అమలు చేయాలని, ప్రభుత్వం నియమించే ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్ శాతం పెంచాలన్నారు. పోడుభూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలను పంపిణీ చేసే అంశంపై ప్రభుత్వం వైఖరిని చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల సభలో ప్రకటించిన ట్రైబల్ డిక్లరేషన్‌లో పొందుపరచిన 12 గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. లంబాడీలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలన్నారు. గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములు కబ్జాకు గురయ్యాయని, వాటిని గుర్తించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం సేవాలాల్ లంబాడా, ఎస్టీ కార్పొరేషన్, తుకారం ఆదివాసీ కార్పొరేషన్, ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతీ సంవత్సరం ఒక్కొక్క కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలన్నారు. రాజ్యాంగబద్ధమైన ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 10 : ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రజాపాలన ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ నాయకులతో శనివారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. గ్రామాలవారీగా చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రధాన సమస్యల పరిష్కారం, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం, అ సంపూర్తి పనుల పూర్తికి అవసరమైన నిధులు కేటాయించాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, నిర్మలాదేవి, ఉమావతిలు కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. తహసీల్దార్, మండల పరిషత్ భవనాల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించి పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామని ఎమ్మెల్యే చెప్పారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, కృష్ణ, నరేశ్‌నాయక్, యాదగిరి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,శ్రీను,రాంచందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఉప సర్పంచ్ కావ్యకృష్ణగౌడ్ జన్మదిన వేడుకలు


కావ్యకృష్ణగౌడ్ దంపతులను సన్మానిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, కేఎస్ రత్నం తదితరులు

చేవెళ్ల, ఫిబ్రవరి 10 : మండల పరిధిలోని కందవాడ తాజా మాజీ ఉప సర్పంచ్ గౌండ్ల కావ్యకృష్ణగౌడ్ పుట్టినరోజు వేడుకలు శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పలువురు నాయకుల సమక్షంలో కావ్యకృష్ణగౌడ్ కేక్ కట్ చేశారు. అనంతరం మాజీ ఉపసర్పంచ్ దంపతులను నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కావ్యకృష్ణగౌడ్ దంపతులు నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో ఉండాలన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకొని ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జి. కృష్ణగౌడ్, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు దేవుని శర్వలింగం, శ్రీనివాస్‌రెడ్డి, ఆశోక్, శ్రీశైలం మండల నాయకులు పత్తి సత్యనారాయణ, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 10 : విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉన్నత చదువులు చదువుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రేష్మీ పెరుమాల్ అన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు వీడ్కోలు సమావేశం కేజీఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీసీపీ హాజరయ్యారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలన్నారు. అంతకుముందు ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ మహనీయులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. చదువులో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ శేఖర్, సీఐ లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు శ్రీకాంత్‌ముదిరాజ్, మనోహర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాధన రేష్మీ పెరుమాల్

సంక్షిప్తంగా..

● **షాద్‌నగర్ రూరల్** : షాద్‌నగర్ పట్టణంలో హోటళ్లు, దుకాణాల ఎదుట వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేస్తే జరిమానాలు విధిస్తామని ట్రాఫిక్ ఎస్సై రవీందర్ నాయక్ తెలిపారు. పట్టణంలోని పాత జాతీయ రహదారి వెంట ఉన్న దేవిగ్రాండ్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర కాంప్లెక్స్‌ల ముందు నిలిపిన వాహనాలకు శనివారం జరిమానాలు విధించారు. కమర్షియల్ కాంప్లెక్స్‌ల సెల్లార్లు అద్దెకు ఇవ్వడం వల్ల వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారని తెలిపారు.

● **ఇబ్రహీంపట్నం** : సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుకింగ్‌లతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతీ మండలంలో క్యాంపులు ఏర్పాటు చేసి ఈ సర్టిఫికెట్లు జారీ చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాల్ల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన వీహెచ్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచానికే పరిమితమైన దివ్యాంగులు స్లాట్ బుకింగ్‌చేసి సదరం సర్టిఫికెట్ తీసుకోలేకపోతున్నారన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమం తీసుకున్నామన్నారు.

● **కడ్తాల్** : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని విద్యుత్ వినియోగ దారులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ అధికార ప్రతినిధి,ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలో గృహజ్యోతి పథకంలో భాగంగా వినియోగదారుల నుంచి వివరాలు సేకరించారు.

● **ఆమనగల్లు** : మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటకు చెందిన యాదయ్య, తిరుపతయ్యల ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఉప్పల ట్రస్ట్ ద్వారా గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఇళ్ల నిర్మాణాల్లో భాగంగా ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన మెటీరియల్‌ను ట్రస్ట్ సభ్యులు యాదయ్య, తిరుపతయ్యలకు శనివారం అందజేశారు.

క్రైం కార్నర్

కూలిన పురాతన భవనం బాల్కనీ

● పెచ్చులూడి కిందపడటంతో దెబ్బతిన్న 12 ద్విచక్రవాహనాలు
● తప్పిన పెను ప్రమాదం.. ● శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఘటన


దెబ్బతిన్న ద్విచక్రవాహనాలు

శంషాబాద్, ఫిబ్రవరి 10 : పురాతన భవనం బాల్కనీ కూలిన ఘటనలో ద్విచక్రవాహనాలు దెబ్బతినగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటన శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో శనివారం జాతీయ రహదారి పక్కన గల గణేష్ కాంప్లెక్స్‌లో చోటుచేసుకుంది. శంషాబాద్‌లోని హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి పక్కన దాదాపు 40 ఏళ్ల క్రితం గణేష్ కాంప్లెక్స్ నిర్మించారు. 20 దుకాణాలతో పాటు పైన ఉన్న మూడు అంతస్తుల్లో 20 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కాంప్లెక్స్‌కు చెందిన యజమానులు బిల్డింగ్ మెయింటెనెన్స్ సరిగ్గా చేపట్టకపోవడంతో పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే బిల్డింగ్‌లో ఏర్పడిన పగుళ్ల నుంచి పెచ్చులు ఊడిపోయి కిందపడుతుంటాయని అందులో నివాసముండేవారు తెలిపారు. కాగా, కాంప్లెక్స్‌లో కుడివైపున ఉన్న ఓ షాపు యజమాని రెండు రోజుల క్రితం బోరు బోరు వేయించారు. ఆ సమయంలో వచ్చిన ప్రకంపనలతో భవనంలో పగుళ్లు ఎక్కువయ్యాయి. శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో భవనం ఎడమవైపు బాల్కనీతో పాటు కొంతభాగం గోడ పెచ్చులూడి కిందపడ్డాయి. దాంతో కింద ఉన్నటువంటి హీరో హోండా షోరూం ఎదుట పార్కుచేసిన 12 ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. దాదాపు రూ.పది లక్షల ఆస్తినష్టం జరిగిందని ఆ షోరూంలో పని చేసే రమేష్ అనే కార్మికుడు తెలిపాడు. మున్సిపల్ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. భవన యజమానులకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. కాగా, బాల్కనీ కూలిన సమయంలో పెద్ద శబ్ధంతో శిథిలాలు కిందపడటంలో ఉలిక్కిపడ్డామని, ఒక్కసారిగా దుమ్ము కమ్ముకోవడంతో కొద్దిసేపు ఏం జరుగుతుందో తెలియలేదని కాంప్లెక్స్‌లో నివాసముంటున్న రాజు, విజయ్‌లతో పాటు దుకాణ యజమానులు తెలిపారు. కాగా, గణేష్ కాంప్లెక్స్‌లోని ఓ దుకాణ యజమాని బోరు వేయించినందుకే భవనం పగుళ్లు ఎక్కువై కూలిపోవడానికి కారణమైందని అందులో నివాసముంటున్న వారు ఆరోపిస్తున్నారు.

గుట్కా విషయంలో గొడవ.. కార్మికుడి దారుణ హత్య

శంషాబాద్, ఫిబ్రవరి 10 : గుట్కా విషయంలో గొడవపడిన ఘటనలో ఓ కార్మికుడిని సెక్యూరిటీ గార్డులు హత్యచేసిన ఘటన శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గగన్‌పహడ్ పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. ఓ కంపెనీలో పనిచేసే కార్మికుడిని అదే కంపెనీలో పనిచేసే ఇద్దరు సెక్యూరిటీ గార్డులు కత్తితో పొడిచి దారుణంగా హత్యచేసి పరారయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. నేపాల్‌కు చెందిన విజయ్ బహదూర్(52) కొన్నేళ్ల క్రితం గగన్‌పహడ్‌కు వలసవచ్చి ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ కుటుంబంతో పాటు అక్కడే ఓ గదిలో నివాసముంటున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి 9.00 గంటల సమయంలో ఇంట్లో భోజనం చేసిన విజయ్.. ఇంటి సమీపంలోని సెక్యూరిటీ రూం వద్దకు వెళ్లాడు. అక్కడున్న సెక్యూరిటీ గార్డులు నిత్యానందరాయ్, చోటూకుమార్‌తో గుట్కా విషయంలో గొడవపడ్డాడు. దాంతో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహం చెందిన చోటూకుమార్, నిత్యానందరాయ్‌లు కూరగాయలు కోసే కత్తితో విజయ్ బహదూర్‌పై దాడి చేశారు. మెడ కిందిభాగంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడి నుంచి కొద్దిదూరం వెళ్లి రక్తం కక్కి చనిపోయాడు. ఇది చూసిన ఆ ఇద్దరు సెక్యూరిటీ గార్డులు అక్కడి నుంచి పారిపోయారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరుడు ప్రకాష్ బహదూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్య విషయం వెలుగుచూసింది. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు.

అన్నాదమ్ముల అదృశ్యం

● ఉందానగర్ రైల్వేస్టేషన్ వద్ద ప్రత్యక్షమైన కవలలు
● తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

శంషాబాద్, ఫిబ్రవరి 10 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండిపల్లి పాఠశాలలో చదివే ఇద్దరు అన్నాదమ్ములు(కవలలు) శనివారం అదృశ్యమయ్యారు. ఈమేరకు వారి కుటుంబికులు శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తొండిపల్లికి చెందిన సుమన్‌దేవి, రాకేష్‌శర్మ దంపతుల కుమారులు అనురాగ్, మనీష్‌లు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం స్కూల్లోని సైన్స్ ల్యాబ్‌లో వారు ఓ విద్యుత్ పరికరాన్ని దొంగిలించి ఓ షాపు యజమానికి అమ్మడానికి యత్నించారు. అదే పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు గమనించి మందలించాడు. ఈమేరకు తల్లిదండ్రులను శనివారం పాఠశాలకు తీసుకురావాలని చెప్పాడు. దాంతో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి శనివారం పాఠశాల గేటు వరకు వచ్చి వారిని లోపలికి పంపి మధ్యాహ్నం ఆమె భర్తను తీసుకొస్తామని చెప్పి వెళ్లిపోయింది. ఉదయం 11 గంటల సమయంలో రాకేష్‌శర్మ పాఠశాలకు వెళ్లి టీచర్లను కలవగా.. మీ పిల్లలు స్కూల్‌కి రాలేదని, మీరు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. అయితే, ఆ పిల్లలిద్దరూ పాఠశాలకు వెళ్లలేదనే విషయం తెలుసుకొని చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకగా.. తొండిపల్లి బ్రిడ్జి ప్రాంతంలో ఆడుకుంటూ కనిపించారని, ఆతర్వాత కనిపించకుండా అదృశ్యమయ్యారని స్థానికుల ద్వారా తెలిసింది. కుటుంబికులు పెద్దషాపూర్‌లోని శంషాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టారు. ఈమేరకు రాత్రి శంషాబాద్ పరిధిలోని ఉందానగర్ రైల్వేస్టేషన్ వద్ద ప్రత్యక్షమయ్యారు. దాంతో పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

కొందుర్గు, ఫిబ్రవరి 10: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కుంటలో మునిగి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని పర్వతాపూర్‌లో జరిగింది. ఎస్సై కృష్ణయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన కాశ నర్సింహులు(34) పొలం వద్ద ఉన్న మంజుల కుంటలో తరచూ చేపలు పట్టేవాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో నర్సింహులుతో పాటు దాయాదులైన కాశ అనంతయ్య, కాశ మల్లయ్యలతో కలిసి కుంటలో చేపలు పట్టేందుకు దిగారు. కాగా, సాయంత్రం నర్సింహులు ఇంటికి రాకపోవడంతో అతడి భార్య సునీత కుంట వద్దకు వెళ్ళి చూడగా.. అక్కడ నర్సింహులు బట్టలు, చెప్పులు, సెల్‌ఫోన్ గట్టుపై ఉన్నాయి. దాంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా శనివారం ఉదయం నుంచి నర్సింహులు కోసం కుంటలో రెస్క్యూ టీం గాలించింది. చివరకు సాయంత్రం 5 గంటల సమయంలో శవం దొరికింది. నర్సింహులు కాళ్ళకు చేపల వలలు చుట్టుకోవడంతో మృతిచెందినట్లు ఎస్సై వివరించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. యువకుడు దుర్మరణం

● మరొకరికి తీవ్రంగా గాయాలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10: నాగార్జునసాగర్ ప్రధాన రహదారి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి ఉప్పరిగూడ క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి ఓ మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని బొబ్బిలికి చెందిన నర్రపు వెంకటరమణ(25) మరో వ్యక్తితో కలిసి పల్సర్ బైక్‌పై బొంగులూరులో ఉన్న బంధువుల దగ్గరకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెంకటరమణ మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం సివిల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తంత ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. ట్రాక్టర్ సీజ్

కేశంపేట, ఫిబ్రవరి 10 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి కేశంపేట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై ఇసుక ట్రాక్టర్‌ను వదిలి పారిపోయారు. పోలీసులు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ తరలించారు. ట్రాక్టర్ నెంబర్ ఆధారంగా ట్రాక్ చేయగా ఓనర్ కాకునూర్ గ్రామానికి చెందిన కరికె వెంకటేష్‌గా గుర్తించామని ఎస్సై లింగం తెలిపారు. ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.